సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం | 22 | ఆగస్టు | 2025



తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ విజయవంతం - 8లో

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ విజయవంతమైందని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టాస్) అధ్యక్షుడు మోహన్‌రావు అన్నారు.



మధ్యవర్తిత్వంతో వివాదాలు పరిష్కారం - 8లో

మధ్యవర్తిత్వంతో వివాదాలు సులభంగా పరిష్కారమవుతాయని జస్టిస్ కె.లక్ష్మణ్, సభ్యులు జస్టిస్ జె.శ్రీనివాసరావు అన్నారు.

గరిష్టం/కనిష్టం
32.3° /26.2°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు హనుమకొండలో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

హన్మకొండ అర్బన్ : హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నేడు (శుక్రవారం) పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ జరపనున్నట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ అదాలత్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పెన్షన్, జీపీఎఫ్ కేసులు, ఖాతాల సమస్యలు చర్చించి పరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. ఆయా ఖాతాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

కాచి చల్లార్చిన నీటిని తాగండి

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

భూపాలపల్లి అర్బన్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మిషన్ భగీరథలో మురికినీరు వస్తుందని పట్టణ ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భీంఘన్‌పూర్ చెరువులో మట్టి నీళ్లు ఉండడంతో కోనంపేట పంప్ హౌస్ శుద్ధికరణకు అంతరాయం కలిగిందన్నారు. దీంతో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు మురికిగా వస్తుందన్నారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించాలని సూచించారు.

24న మెడికల్ క్యాంప్

భూపాలపల్లి అర్బన్: సింగరేణి ఏరియా ఆస్పత్రిలో ఈనెల 24వ తేదీన సూపర్ స్పెషాలిటీ వైద్యులతో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుండె, నరాల, మూత్రపిండాల, జీర్ణాశయ, జనరల్ సర్జన్, జనరల్ ఫిజీషియన్ సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు రానున్నట్లు తెలిపారు. వైద్యసేవలు పొందేందుకు హాజరయ్యే కార్మికులు, రిటైర్మెంట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఈనెల 23వ తేదీలోపు సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

చేపల వేటకు వెళ్లొద్దు

భూపాలపల్లి అర్బన్: వర్షాకాలం కారణంగా చెరువులు, వాగులు, వంతెనలు, ఇతర జలాశయాలు పూర్తిగా నిండి ఉన్నాయని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీటి ప్రవాహం బలంగా ఉండటం వల్ల చేపల వేటకు వెళ్లడం ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందన్నారు.

నేడు పనుల జాతర

భూపాలపల్లి రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నేడు (శుక్రవారం) 'పనుల జాతర'లో భాగంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూలీ కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి సంవత్సరంలో 100 రోజులు పని కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

యూరియా కొరత లేదు



రేగొండ: మండలంలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి బాపురావు అన్నారు. గురువారం మండలంలోని పీఏసీఎస్‌లో యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పంట కాలానికి సరిపడా యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆధార్ కార్డుతో ఈపీఓఎస్ మిషన్ ద్వారా యూరియాను కొనుగోలు చేయాలన్నారు. రైతులు పంట పొలాల్లో యూరియాను మోతాదుకు మించి వాడొద్దని, అవసరం లేకున్నా వాటిని నిల్వ చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రేగొండ, కొత్తపల్లిగోరి ఏఓలు వాసుదేవారెడ్డి, సారయ్య, పీఏసీఎస్ సీఈఓ జగన్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తులో భవిష్యత్

గంజాయి కిక్కులో స్టూడెంట్స్, యూత్

- జిల్లాలో విచ్చలవిడిగా అమ్మకాలు
- యువతే టార్గెట్‌గా కోడ్ లాంగ్వేజ్
- మహారాష్ట్ర గుండా జిల్లాకు..



కాళేశ్వరం: గంజాయి మత్తులో పడి జిల్లాలోని విద్యార్థులు, యువకులు చేజేతులా బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువకులు టార్గెట్‌గా జిల్లాలో గంజాయి విక్రయాలు సాగుతుండగా ఆ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. మహారాష్ట్ర గుండా జిల్లాకు చేరుతున్న గంజాయి.. జిల్లాలోని అన్ని గ్రామాల్లో అమ్మకాలు జరుగుతున్నాయి.

ఇష్టారీతిన వదిలేయడంతో..

భూపాలపల్లి, గణపురం, మహాముత్తారం, కాటారం, మహదేవపూర్, కాళేశ్వరం లాంటి మండలాల్లో 13 ఏళ్ల పిల్లల నుంచి 20 ఏళ్ల యువత వరకు మద్యం, సిగరేట్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి బానిసలుగా మారుతున్నారు. పిల్లలను తల్లిదండ్రులు ఇష్టారీతిన వదిలేయడంతో చెడుస్నేహాలు చేస్తూ అడ్డదారులు తొక్కుతున్నారు. పోలీసులు పలుమార్లు కౌన్సెలింగ్‌లు ఇచ్చినా మార్పు రావడం లేదు. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా యువకులు, విద్యార్థులు గంజాయికి బానిసలవుతున్నారు. పాఠశాల స్థాయి నుంచే కొందరు బాలురు గంజాయి కిక్కుకు బానిసలవుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మహారాష్ట్ర టు జిల్లాకు..,.

మహారాష్ట్రలో ఎక్కడో ఒక చోట గంజాయిని రహస్యంగా కొనుగోలు చేస్తున్నారు. సిరొంచ వద్ద కాళేశ్వరం వంతెన దాటితే జిల్లాకు చేరొచ్చు. ఆర్టీసీ బస్సులు, ద్విచక్రవాహనాలపై ఎక్కువగా రవాణా చేస్తున్నారు. ఇలా పదుల సంఖ్యలో తరలిపోతే.. ఒకటి రెండుసార్లు మాత్రమే పోలీసులకు దొరికిపోతున్నారని తెలిసింది. మహారాష్ట్రలోని గిరిజన ప్రాంతాల్లో పోలీసులు కూడా అడుగుపెట్టకపోవడంతో రహస్యంగా గంజాయిని అంతరపంటలుగా సాగు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో అక్కడ కొనుగోలు చేస్తూ జిల్లాతో పాటు పెద్దపల్లి, కరీంగనగర్, మంచిర్యాల జిల్లాలో కూడా విక్రయిస్తూ పట్టుబడ్డ సందర్భాలు ఉన్నాయి.

సీక్రెట్ కోడ్..

వాట్సాప్ గ్రూపులు కూడా తయారు చేసి సీక్రెట్‌గా మాట్లాడుతున్నట్లు తెలిసింది. ఎవరికీ అనుమానం రాకుండా విక్రయదారులు, వినియోగదారులు గంజాయిని ఇక్కడ మాల్, వీడ్, శీలవతి, సోర్కింగ్ లాంటి కోడ్ భాషల్లో పిలుస్తున్నారని సమాచారం. స్థానిక గంజాయి ప్రియులు మాల్, శీలవతిగా, స్టూడెంట్స్, యువకులు వీడ్, సోర్కింగ్ అంటూ వివిధ రకాల కోడ్ లాంగ్వేజ్‌ను ఉపయోగిస్తున్నారు. ప్యూర్ గంజాయిని శీలవతిగా పేర్కొంటున్నారు. ఇది కిలోకు రూ.25 వేల పైనే ధర పలుకుతుందని, మిగతా రెండో రకం గంజాయికి రూ.10 వేలకు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. పట్టణంలోని పలు వాడల్లో యువకులు, స్టూడెంట్స్ గంజాయి మత్తుకు ఆకర్శితులవుతున్నారని సమాచారం.

ఇటీవలి ఘటనలు..

- జూలై 7న భూపాలపల్లిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఐదుగురు వ్యక్తులు 135 కిలోల గంజాయితో పట్టుబడ్డారు.
- ఐటీఐ విద్యార్థులు ముగ్గురు జూలై 23న కాళేశ్వరం వద్ద 3.31 కిలోల గంజాయితో పోలీసులకు చిక్కారు.
- జూలై 26న మహాముత్తారం మండలం నుంచి భూపాలపల్లి వైపునకు బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు 6.30 కిలోల గంజాయితో పట్టుబడ్డారు.
- జూలై 30న భూపాలపల్లి బస్టాండ్ వద్ద 300గ్రాముల గంజాయితో ఒకరు పట్టుబడ్డారు.
- ఈనెల 11న మంథని మండలం ఎక్లాస్‌పూర్ శివారులోని గాడుదులగండి గుట్ట సమీపంలో గంజాయి రవాణా చేస్తూ ఇద్దరితో పాటు మైనర్లు పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద మహారాష్ట్రలోని సిరొంచ ప్రాంతంలో కొనుగోలు చేసిన 2.23 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది.

యువతపై దృష్టి సారిస్తాం



మహదేవపూర్ సర్కిల్ పరిధిలో మత్తు పదార్థాలకు అలవాటు పడ్డ యువతపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తాం. ఎస్పీ ఆదేశాలతో ప్రతి గ్రామంలో కార్డెన్ సెర్చ్ ద్వారా యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. గంజాయి, మత్తుకు అలవాటు పడ్డ వారికి పోలీసుస్టేషన్లలో కౌన్సెలింగ్ ఇచ్చి వారిపై దృష్టిసారిస్తాం. మహారాష్ట్ర నుంచి వచ్చే గంజాయిపై ప్రత్యేక నజర్ వేస్తాం.

- ఎస్.వెంకటేశ్వర్లు, సీఐ, మహదేవపూర్

పూర్వ ప్రాథమిక తరగతులకు నిధులు

- కొన్నింటికి రూ.1.70లక్షలు, మరికొన్నింటికి రూ.50వేల చొప్పున విడుదల
- తరగతి గదికి కలర్, ఆటవస్తువులకు, విద్యార్థులకు బ్యాగ్, షూస్, టై, బెల్టు
- త్వరలోనే ఆయాలు, ఇన్‌స్ట్రక్టర్ల నియామకం



జిల్లాల వారీగా పాఠశాలలకు నిధులు మంజూరు ఇలా..(రూ.లక్షల్లో)

జిల్లా	పాఠశాలలు	నిధులు
భూపాలపల్లి	54	78.60
వరంగల్	32	54.40
హనుమకొండ	65	52.50
మహబూబాబాద్	22	37.40
జనగామ	15	21.90
ములుగు	08	13.60

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరంనుంచి పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే పలు పాఠశాలల్లో చిన్నారులకు అడ్మిషన్లు కల్పించారు. ప్రభుత్వం తాజాగా సమగ్ర శిక్ష ద్వారా పూర్వ ప్రాథమిక తరగతుల విద్యార్థుల కోసం నిధులు మంజూరు చేసి విడుదల చేసింది. ఈ మేరకు ఒక్కో స్కూల్‌కు రూ.1.70లక్షల నిధులను కలెక్టర్లకు జమ చేశారు. హనుమకొండ జిల్లాలో 45 పూర్వ ప్రాథమిక తరగతులకు నిధులు మంజూరై విడుదలయ్యాయి. అందులో 25 స్కూళ్లకు రూ.1.70లక్షల చొప్పున, మరో 20 స్కూళ్లకు రూ.50వేల చొప్పున నిధులు మంజూరు చేశారు.

రంగులు, విద్యార్థులకు ఆట వస్తువులు

ఆయా పాఠశాలల్లోని పూర్వ ప్రాథమిక తరగతి గదికి రూ.50వేలు వెచ్చించి రంగులు వేయించాల్సింటుంది. ఆట వస్తువులు కొనుగోలు చేయాలి. ఒక్కో విద్యార్థికి రూ.1,000 కేటాయించి బ్యాగ్, షూస్, బెల్ట్, టై తదితర వస్తువులు కొనుగోలు చేయాలి. ఈ నిధులు జిల్లా కలెక్టర్లకు విడుదల చేసిన నేపథ్యంలో వాటిని ఎలా వినియోగించుకోవాలనే విషయంపై కూడా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్.. డీఈఓలకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. త్వరలోనే జిల్లాల కలెక్టర్లు ప్రతీ పూర్వ ప్రాథమిక తరగతి విద్యార్థుల బాగోగులు చూసుకునేందుకు ఒక ఆయా, ఒక ఇన్‌స్ట్రక్టర్ నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం.

తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దు

డీఈఓ రాజేందర్

మొగుళ్లపల్లి: కొర్కిశాల కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఫుడ్ పాయిజన్ అయిందని సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవమని.. విద్యార్థినుల తండ్రిదండ్రులు ఆందోళన చెందవద్దని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ అన్నారు. డీఈఓ రాజేందర్, ఇన్‌చార్జ్ జిల్లా వైద్యాధికారి సునీత, మొగులపల్లి ఎస్సై అశోక్ గురువారం కేజీబీవీని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎనిమిది మంది పిల్లలకు వైరల్ ఫీవర్ రాగా.. నలుగురికి వాంతులు అయినట్లు తెలిపారు.



భోజనం చేస్తుండగా పరిశీలిస్తున్న డీఈఓ

స్కూల్ ఎస్ఓ శైలజను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురువారం మండల వైద్యాధికారి నాగరాణి ఆధ్వర్యంలో స్కూల్‌లో హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

'పనుల జాతర'కు ఏర్పాట్లు చేయాలి

- మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి గ్రామాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు చేపట్టిన పనుల జాతర-2025కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి నేడు (శుక్రవారం) నిర్వహించనున్న 'పనుల జాతర-2025' కార్యక్రమంపై గురువారం ఎంపీడీఓలు, ఎంపీఓలు, డీపీఓలు, పీఆర్ ఇంజనీర్లు, ఏపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులు మరింత పారదర్శకంగా, ఫలప్రదంగా ఉండేలా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. నేడు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రూ. 3.93 కోట్ల వ్యయంతో 1,075 పనులు చేపట్టనున్నామని, అధికారులు భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ బాలకృష్ణ, డీపీఓ శ్రీలత, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి..

జిల్లాలో పీఎం ఆవాస్ యోజన సర్వే పనులను ఈ నెలాఖరులోపు పూర్తిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయం నుంచి గృహ నిర్మాణశాఖ అధికారులు, ఎంపీడీఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో 55,444 ఇళ్ల సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 3,359 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయన్నారు. సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు.



మట్టి వినాయక విగ్రహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

మట్టి వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి..

వినాయక చవితి సందర్భంగా ప్రజలు పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి చేపట్టిన మట్టి వినాయక విగ్రహాలను ఆవిష్కరించారు. జిల్లావ్యాప్తంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వినాయక చవితి రోజున రెండు వేల మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి క్రాంతికిరణ్, కలెక్టరేట్ సీ విభాగం పర్యవేక్షలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

భద్రత, బందోబస్తు కోసమే ఆన్‌లైన్ నమోదు

- గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
- ఎస్పీ కిరణ్ ఖరే



భూపాలపల్లి: భద్రత, బందోబస్తు కోసమే పోలీసుశాఖ ఆధ్వర్యంలో గణేష్ మండపాల నిర్వహణకు సంబంధించిన ఆన్‌లైన్ నమోదు చేస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ సమాచారం ఇవ్వడానికి రుసుం లేదన్నారు. మండపాల నిర్వాహకులు గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసే ముందు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తప్పకుండా సమాచారం ఇవ్వాలని, పోలీస్ పోర్టల్‌లో వివరాలు పొందుపరచాలని తెలిపారు. మండపాల నిర్వాహకులు తప్పకుండా నిబంధనలు పాటించాలన్నారు. ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద షార్ట్ సర్క్యూట్ జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. డీజేలు ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదని, సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలన్నారు. పోలీసుశాఖకు సహకరిస్తూ ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు.

అక్రమాలకు కేరాఫ్‌గా డీటీఓ కార్యాలయాలు!

ఏసీబీ దాడులకు వెరవని రవాణాశాఖ అధికారులు

- వసూళ్లకు ప్రైవేట్ వ్యక్తులు, ఏజెంట్లే మధ్యవర్తులు
- కాసుల కక్కుర్తితో అడ్డంగా దొరుకుతున్న అధికారులు
- ఆదాయానికి మించిన ఆస్తులు.. ఆ ఫిర్యాదులపైనే పలువురిపై దాడులు
- ప్రతి పనికీ రేటు.. ఇటీవలే రెండింతల పెంపు
- హనుమకొండ డీటీఓ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు

సాక్షిప్రతినిధి, వరంగల్: రవాణాశాఖ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలు ఆగడం లేదు. అన్ని పనులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఏజెంట్లు, ప్రైవేట్ వ్యక్తులు రూ.లక్షలకు పడగలెత్తుతుండగా.. అధికారుల ఆదాయం, అక్రమాస్తులకు హద్దూపద్దు లేదు. ఇటీవల అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు జరిపిన దాడుల్లో వెల్లడవుతున్న ఆస్తుల వివరాలే ఇందుకు సాక్ష్యం. మే 7న ఏకంగా వరంగల్ డీటీసీ పుప్పాల శ్రీనివాస్ ఇంటిపై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై దాడులు చేసిన ఏసీబీ.. ఆ తర్వాత ఈ జిల్లాలో పనిచేసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న జగిత్యాల డీటీఓ భద్రు నాయక్ రూ.22వేలు తీసుకుంటుండగా ఆగస్టు 6న పట్టుకున్నారు. తాజాగా వరంగల్, హనుమకొండలలో ఎంవీఐగా పనిచేసిన జి.వివేకానంద రెడ్డి నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ చిక్కడం రవాణాశాఖలో కలకలం రేపుతోంది. నెల రోజుల కిందట వివిధ పనుల కోసం ఏజెంట్ల ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణల మేరకు వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించిన ఏసీబీ.. కొందరు సీనియర్ ఎంవీఐల ఆస్తులపై ఆరా తీస్తుండటం హాట్‌టాపిక్‌గా, చర్చనీయాంశంగా మారింది.

అంతులేని ఆదాయం.. పోస్టింగ్ కోసం పోటాపోటీ..

రవాణాశాఖలో అంతులేని ఆదాయం ఉండటంతో కొందరు అధికారులు పోటీపడి పోస్టింగ్‌లు కొడుతున్నారు. కొందరు మోటారు వెహికిల్ ఇన్‌స్పెకర్లు ఇప్పుడు ఇన్‌చార్జ్ డీటీఓలుగా కూడా అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ఇందులో కూడా కొన్నిచోట్ల సీనియర్‌లు తిరకాసు చేసి జూనియర్‌లను ముందుంచి తెరవెనుక అక్రమ ఆదాయమార్గాలపై చక్రం తిప్పుతున్నారు. హనుమకొండ డీటీఓ పోస్టు కూడా ఖాళీ అయిన సమయంలో వాస్తవానికి అదే కార్యాలయంలో సీనియర్‌గా ఉన్న 1994 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఎంవీఐ డీటీఓగా బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. అయితే తెరపైన కీలక పోస్టులో ఉండటం ఇష్టం లేక అతనే ఆ పోస్టుపై విముఖత చూపడంతో 2012 బ్యాచ్‌కు చెందిన ఒకరికి ఆ పోస్టు కట్టబెట్టి ఆ సీనియర్ ఎంవీఐ అన్నీ తానై చూస్తుండటం వల్లే మామూళ్లు రెండింతలయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలాఉంటే ఇన్‌చార్జ్‌ల కోసం అన్ని జిల్లాల్లో పోటీ ఉంది. వరంగల్‌లో ఎంవీఐగా ఉన్న ఒకరు మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీటీఓగా వ్యవహరిస్తుండగా, పెద్దపల్లి ఎంవీఐగా ఉన్న ఓ అధికా రి ఆ పోస్టుతోపాటు ములుగు ఎంవీఐగా, ఇన్‌చార్జ్ డీటీఓగా వ్యవహరిస్తున్నారు. భూపాలపల్లిలో ఎంవీఐగా, ఇన్‌చార్జ్ డీటీఓగా ఒక్కరే చూస్తున్నారు. ఇలా.. ఏళ్లతరబడిగా ఉమ్మడి వరంగల్‌లో పాతుకుపోయిన కొందరు రవాణాశాఖ అధి కారుల తీరుపై ఆ శాఖ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. హైదరాబాద్ స్థాయిలో పైరవీలు చేసుకుంటూ కోరుకున్న పోస్టుల్లో కొనసాగుతున్నారంటున్నారు. కాగా,రవాణాశాఖలో పెచ్చుమీరుతున్న అవినీతిపై కొందరు అవినీతి నిరోధకశాఖ అధికారులు కూడా ద్వంద్వ వైఖరితో ఉన్నారన్న చర్చ కూడా ఆ శాఖలో జరుగుతోంది. వ్యక్తిగత పరిచయాల ఆధారంగా లెక్కకు మించిన అవినీతి జరిగినా ఆ కార్యాలయాలు, అధికారులపై ఉదాసీనంగా ఉంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



హనుమకొండ డీటీఓలో రెండింతలు పెరిగిన వసూళ్లు..

హనుమకొండ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో వివిధ పనుల కోసం లంచాలు వసూలు చేస్తున్నారని, ఏజెంట్ల ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఏడాది క్రితం వచ్చిన ఓ సీనియర్ ఎంవీఐ.. ఈ కార్యాలయానికి లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ కోసం వచ్చే వాళ్ల నుంచి చేసే వసూళ్లు రెండింతలు చేశారన్న ఫిర్యాదులు కమిషనర్ కార్యాలయం వరకు వెళ్లాయి. లెర్నింగ్ లైసెన్స్‌కు ఏడాది కిందట రూ.500 వరకు తీసుకుంటే ప్రస్తుతం రూ.1,000కి పెంచారని, రూ.700–800లు ఉన్న లైసెన్స్ మామూళ్లు రూ.2,000లకు పెరిగిందని బాధితులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వాహనాలు కొనుగోలు చేసుకొని వచ్చిన అర్జీదారుడికి అసలు కంటే కొసరే ఎక్కువగా భారమవుతుందని తెలుస్తోంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన అసలు సొమ్మును కట్టినా తనిఖీ అధికారులు కొసరుగా వేరే రేట్లను ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. గతంలో ఒక్కో వాహనానికి రూ.2200 ఉంటే దానిని ఏకంగా రూ.5500 పెంచినట్లు ఆరోపణలున్నాయి. ఇలాగే ఇటీవల జూన్ మాసంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ ధరలు ఒక్కోబస్సుకు రూ.4,500ల వరకు వసూలు చేయడం వివాదాస్పదమైంది. కాగా ముఖ్యంగా వాహన ఫిట్‌నెస్‌లు, లెర్నింగ్ లైసెన్సు, డ్రైవింగ్ లైసెన్సుల ఫైళ్లపైనే కోడ్‌లు ఉండడం బహిరంగ రహస్యం. కోడ్‌లేని ఫైళ్లను.. చిన్న చిన్న పొరపాట్లను సాకుగా చూపుతూ కొర్రీలు పెడుతూ ఫిట్‌నెస్ ఆపడం.. వాహనదారుడు దానికి వేరే రేటు ఇచ్చుకుంటే పూర్తి చేయడం ద్వారా రూ.వేలు చేతులు మారుతున్నాయి.


మెరుగైన వైద్యం అందించాలి

కాళేశ్వరం: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సెంట్రల్ నోడల్ పర్సన్ డాక్టర్ రమణ అన్నారు. గురువార కాళేశ్వరం, బ్రాహ్మణపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించారు. బీపీ, షుగర్, గర్భిణులు, రక్త హీనత పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీవీబీడీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రమోద్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సందీప్, డీపీఎంఓ చిరంజీవి, డాక్టర్ సుస్మిత, ఎంఎల్‌హెచ్‌పీ మమత పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించాలి

సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు

భూపాలపల్లి అర్బన్: వృద్ధాప్యంలో ఉన్న వారిని గౌరవించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు తెలిపారు. ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలోని వృద్ధాశ్రమంలో న్యాయ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. సమస్యలు ఎదుర్కొంటున్న వయోవృద్ధులు ఎవరైనా సరే న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే వారికి చట్టబద్ధంగా ఉచిత సహాయం ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల చట్టం, న్యాయ సేవాధికార సంస్థ అమలుపరుస్తున్న వివిధ పథకాలను వారికి వివరించారు. వృద్ధాశ్రమంలో నివాసం ఉంటున్న పెద్దవారితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దిలీప్‌కుమార్, బొట్ల సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసచారి, అమృతవర్షిణి, అక్షర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు శ్యామ్ ప్రసాద్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ కంప అక్షయ, ప్రియాంక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

కాటారం: కాటారం మండలం శంకరాంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ పరిశీలించారు. భారీ వర్షం కురిసినప్పుడు వరద నీరు అంగన్‌వాడీ కేంద్రంలోకి చేరడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సీడీపీఓ రాధికతో కలిసి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి భవనం పరిస్థితి, చిన్నారుల ఇబ్బందిపై ఆరా తీశారు. రోడ్డు ఎత్తుగా ఉండటం, కేంద్రం చుట్టూ నీరు నిలిచి ఉండటాన్ని గమనించిన సబ్ కలెక్టర్ వెంటనే చర్యలు చేపట్టాలని పీఆర్ డీఈ సాయిలును ఆదేశించారు. శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సీడీపీఓ, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ సబ్ కలెక్టర్‌ను కోరారు. గ్రామంలో డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరగా.. నివేదిక తయారు చేయాలని సబ్ కలెక్టర్ అధికారులకు సూచించారు. సబ్ కలెక్టర్ వెంట పీఆర్ ఏఈ సతీశ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మయాంక్‌సింగ్

490మంది ఎస్‌ఏలకు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు

విద్యారణ్యపురి: మల్టీజోన్ -1 పరిధి వరంగల్ పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ పరిధిలోని 19 జిల్లాల్లోని 490మంది స్కూల్ అసిస్టెంట్‌లకు హెడ్మాస్టర్లు (గ్రేడ్-2) పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇందులో ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని హైస్కూల్స్‌కు 53మంది స్కూల్ అసిస్టెంట్‌లు హెడ్మాస్టర్లుగా, లోకల్ బాడీ యాజమాన్యాల పరిధిలోని 437 మంది ఎస్‌ఏలు హెడ్మాస్టర్లుగా పదోన్నతి పొందారు. వీరు తమకు కేటాయించిన హైస్కూల్స్‌లో జాయిన్ అయ్యేందుకు 15 రోజుల సమయం ఉంటుంది. కానీ ఆయా స్కూల్ అసిస్టెంట్‌లు ఎక్కువశాతం మంది ఈ నెల 22న రిలీవ్ అయి వెంటనే హెడ్మాస్టర్లుగా జాయిన్ కానున్నారని సమాచారం.

నేటినుంచి దూరవిద్య డిగ్రీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీఎస్సీ మొదటి, ద్వితీయ, ఫైనలియర్ ఎక్స్, రెగ్యులర్ విద్యార్థులకు ఈనెల 22 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ గురువారం తెలిపారు. ఈనెల 22, 26, 30, సెప్టెంబర్ 3, 8,11 తేదీల్లో ఫైనలియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. దూరవిద్య డిగ్రీ సెకండియర్ విద్యార్థులకు ఈనెల 23, 28,సెప్టెంబర్ 1, 4, 9, 11, 17 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు, డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈనెల 25, 29,సెప్టెంబర్ 2, 6, 10, 15, 18వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని పద్మజ తెలిపారు. కేయూ దూరవిద్య కేంద్రం పరిధిలో 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 8,200 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని పద్మజ తెలిపారు.

కోతుల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు


గాయపడిన మల్లికాంబ

కేసముద్రం: కోతుల దాడితో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఇనుగుర్తిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కందునూరి మల్లికాంబ తన ఇంటి ఆవరణలో పనిచేస్తుండగా, ఒక్కసారిగా కోతులు ఆమెపై దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటనలో మల్లికాంబ కాళ్లు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. కోతుల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో చేయి విరిగింది.

ఏటీఎం గోడను ఢీకొట్టిన గూడ్స్ రైలు

- వరంగల్ రైల్వే స్టేషన్‌లో త్రుటిలో తప్పిన ప్రమాదం



ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలు పార్కింగ్ కోసం గురువారం ఉదయం వెనక్కి ప్రయాణిస్తూ ఏటీఎం గోడను ఢీకొట్టింది. దీంతో ఎవరికి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగపోవడం అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన తెలిసిన వెంటనే రైల్వేస్టేషన్ అధికారులు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై వెంకటేశ్వర్లు, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సురేందర్ ప్రమాద స్థలానికి చేరుకున్నారు. గూడ్స్ రైలు ఢీకొట్టిన ఏటీఎం గోడను పరిశీలించారు. రైలు వెనక్కి వెళ్తూ అకస్మాత్తుగా గోడను ఢీకొట్టిందన్నారు.

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ విజయవంతం

- టాస్ అధ్యక్షుడు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ మోహన్‌రావు
- ముగిసిన సైన్స్ కాంగ్రెస్



సైన్స్ కాంగ్రెస్ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న టాస్ అధ్యక్షుడు మోహన్‌రావు, కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవంలోకి అడుగిడిన వేళ తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, కాకతీయ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ విజయవంతమైందని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టాస్) అధ్యక్షుడు, హైదరాబాద్ సీసీఎంబీ మాజీ డైరెక్టర్ సి.హెచ్. మోహన్‌రావు అన్నారు. మూడురోజులుగా యూనివర్సిటీలో 'ఇన్నోవేటివ్ స్కిల్ ఫర్ ఎంపవర్‌మెంట్ సైన్స్‌అండ్ టెక్నాలజీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా' అనే అంశంపై నిర్వహించిన తెలంగాణ సైన్స్‌కాంగ్రెస్ గురువారం ముగిసింది. ఈ ముగింపు సభలో మోహన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశాభివృద్ధిలో సైన్స్‌కీలకమన్నారు. ఈసభకు అధ్యక్షత వహించిన కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ,స్పేస్, క్వాంటం పరిశోధన అంశాలు విద్యార్థులు, పరిశోధకుల్లో ఆసక్తి రేకెత్తించాయన్నారు. తెలంగాణ అకాడమీ సైన్సెస్ జనరల్ సెక్రటరీ ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ శాస్త్రసాంకేతిక పురోగతే లక్ష్యంగా తెలంగాణ అకాడమి పనిచేస్తుందన్నారు. కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం మాట్లాడుతూ శాస్త్రవేత్తల నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలన్నారు. తెలంగాణ సైన్స్‌కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ 48 ఆహ్వానిత లెక్చర్స్, ఐదు ప్లీనరీలెక్చర్లు, 164 ఓరల్ ప్రజెంటేషన్లు, పోస్టర్ ప్రజెంటేషన్లు కొనసాగాయన్నారు. మొత్తం 780 మంది పరిశోధకులు తమ పరిశోధన పత్రాలు సమర్పించారన్నారు. టాస్ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, జాయింట్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ట్రెజరర్ ఎస్ఎం రెడ్డి, వివిధ డీన్లు బి. సురేశ్‌లాల్, జి. హనుమంతు, గాదె సమ్మయ్య, సదానందం తదితరులు మాట్లాడారు. ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ప్రసాద్ వందన సమర్పణ చేశారు.

ప్రాచీన భారతీయ విజ్ఞానాన్ని కొట్టిపారేయలేం..

- కృత్రిమం కంటే సహజసిద్ధ డైమండ్ విలువైనది
- తిరువనంతపురం ప్రొఫెసర్ ఎస్.వి. చలపతి




మాట్లాడుతున్న తిరువనంతపురం ప్రొఫెసర్ చలపతి, ఇక్రిశాట్ సైంటిస్ట్ ప్రొఫెసర్ నారాయణరావు, ప్రొఫెసర్ రఘురాం

కేయూ క్యాంపస్: ప్రాచీన భారతీయ విజ్ఞానాన్ని కొట్టిపారేయలేమని తిరువనంతపురం ఇస్రో ఎస్ఈఎస్ఎస్ ప్రొఫెసర్ ఎస్.వి.చలపతి అన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో గురువారం 'డైమండ్స్ ఫ్రమ్ థేర్ బర్త్‌టూ ఎటర్నిటీ' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూగోళశాస్త్రం ఎంతో గొప్పదన్నారు. కృత్రిమ డైమండ్స్‌పై మోజుపెరిగినా సహజసిద్ధమైన డైమండ్ విలువైందన్నారు. భారతీయ డైమండ్ మార్కెట్ ప్రపంచంలో చాలాపెద్దదన్నారు.

ఇంజనీరింగ్ టెక్నాలజీలో నూతన ఆలోచనలకు పదును..

ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త ఆలోచనలకు పదును పెట్టాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ సి. రాఘవేంద్రరావు అన్నారు. 'సుర్రోగేట్స్ అండ్ అప్రాక్సిమేషన్స్ ఫర్‌ఇంజనీరింగ్ స్పేస్‌టెక్నాలజీ' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. అలాగే, 'స్పేస్‌టెక్నాలజీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై హైదరాబాద్‌లోని జీపీ బిర్లా సైంటిఫిక్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ కె. మృత్యుంజయరెడ్డి.. స్పేస్ టెక్నాలజీలో వస్తున్న మార్పులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

కలుపు నివారణలో సాంకేతికత..

కలుపునివారణలో సాంకేతికత ప్రధాన భూమికపోశిస్తుందని ఇక్రిశాట్ సైంటిస్ట్ ప్రొఫెసర్ ఎ. నారాయణరావు అన్నారు. 'క్లైమేట్ రిసిలిఎంట్ ఇంటిగ్రేటెడ్ విత్ మేనేజ్‌మెంట్'అనే అంశంపై ఆయన మాట్లాడారు. హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ కిశోర్‌నట్టి.. రసాయన, ఔషధ పరిశ్రమలో ఉపయోగించే ఉత్ప్రేరక సమ్మేళనాల ప్రభావ పాత్రను వివరించారు. ముంబాయి బాబా అటమిక్ రీసెర్చ్‌సెంటర్ సైంటిస్ట్ డి. విద్యాసాగర్ మాట్లాడుతూ రేడియోలాజికల్ అత్యవసర పద్ధతులకు సిద్ధంగా ఉండాలన్నారు. బెంగుళూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ తిరుపతి.. మానవశరీరంలోని సమీకరణాలు, ప్రవేశ విలువలు, షరతుల గురించి వివరించారు. కేన్సర్ నివారణపై రిటైర్డ్ ప్రొఫెసర్ రామ్‌బాహు వివరించారు.

పర్యావరణంపై గంభీర సవాళ్లు..

ఆహార ఉత్పాదకతకు అత్యవసరమైన నత్రజని, భాస్వరం సమ్మేళనాలు వ్యవసాయం, వ్యర్థ పదార్థాల నిర్వహణలో సరైన విధంగా ఉపయోగించుకోకపోవడంతో పర్యావరణానికి సవాళ్లు ఎదురవుతున్నాయని న్యూఢిల్లీ ఇంద్రప్రస్థ యూనివర్సిటీ ప్రముఖ్ వైజ్ఞానిక్ ప్రొఫెసర్ నందుల రఘురాం అన్నారు. 'పోషకవనరుల నిర్వహణ -పర్యావరణం' అనేఅంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ పద్ధతుల్లో మార్పు తీసుకురావాలన్నారు.

మధ్యవర్తిత్వంతో వివాదాలు సులభంగా పరిష్కారం


శిక్షణ పొందిన న్యాయవాదులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న న్యాయమూర్తులు నిర్మలా గీతాంబ, పట్టాభిరామ్

- జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు

వరంగల్ లీగల్ : మధ్యవర్తిత్వంతో వివాదాలు సులభంగా పరిష్కారమవుతాయని మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ సెంటర్ పాలకమండలి అధ్యక్షులు జస్టిస్ కె.లక్ష్మణ్, సభ్యులు జస్టిస్ జె.శ్రీనివాసరావు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయా జిల్లాల న్యాయసేవాధికారసంస్థలు గుర్తించిన మధ్యవర్తిత్వం భావన, సాంకేతికతలపై సాధికారత పొందిన న్యాయవాదుల ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం వరంగల్ టెన్ కోర్టు కాంప్లెక్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు వర్చువల్‌గా హాజరుకాగా తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సి.హెచ్. పంచాక్షరి ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా రెండు పక్షాల వారికి సమయం, డబ్బు ఆదా అవడంతోపాటు శాంతి, సామరస్యంగా సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఇది కక్షిదారుల చాలా ప్రయోజనం చేస్తుందన్నారు. అనంతరం శిక్షణ పొందిన న్యాయవాదులకు సభ్య కార్యదర్శి సి.హెచ్. పంచాక్షరి, వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వి.బి నిర్మలా గీతాంబ, డాక్టర్ కె.పట్టాభిరామ్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు నారాయణబాబు, మనీషా శ్రావణ్ ఉన్నమ్, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసేవాధికార సంస్థల కార్యదర్శులు సాయికుమార్, క్షమాదేశ్ పాండే, ఇతర న్యాయమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల న్యాయపోరాటం ఫలించింది

- సీబీసీ ప్రెసిడెంట్ విజయ్‌స్వరూప్


మాట్లాడుతున్న సీబీసీ ప్రెసిడెంట్ విజయ్ స్వరూప్

హన్మకొండ చౌరస్తా: క్రైస్తవ మిషనరీ ఆస్తుల పరిరక్షణ కోసం మూడు దశాబ్దాల పాటు సాగిన న్యాయపోరాటం ఫలించిందని హనుమకొండ సెంటనరీ బాప్టిస్టు చర్చి ప్రెసిడెంట్ తాళ్లపెల్లి విజయ్‌స్వరూప్ అన్నారు. హనుమకొండలోని మిషన్ ఆస్పత్రి ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేల కోట్ల విలువైన మిషనరీ ఆస్తులను కొందరు అక్రమంగా అమ్ముకున్నారని, ఆస్తుల పరిరక్షణ కోసం ముప్పై ఏళ్ల క్రితం డి. జయరాజ్ మరో నలుగురితో కలిసి న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. మూడు దశాబ్దాల పోరాటం తర్వాత మద్రాస్ హైకోర్టు చారిత్రక తీర్పు వెలువరించిందన్నారు. 2,000 సంవత్సరం తర్వాత అక్రమంగా అమ్మిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో పాటు భవిష్యత్‌లో అమ్మేందుకు ఎవరికి హక్కు లేదంటూ తీర్పు వెలువరించిందన్నారు. కాగా, మిషనరీ ఆస్తుల పరిరక్షణకు జరిగిన న్యాయపోరాటంలో స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సాయం మరవలేనిదని, ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాది రాం గోపాల్‌రావు, నెల్లూరుకు చెందిన క్రైస్తవులు అనిల్ కుమార్, సునీల్‌కుమార్, సీబీసీ సెక్రటరీ క్రిష్టోఫర్ రూబెన్, జాయింట్ సెక్రటరీ విద్యాకర్, ట్రెజరర్ విల్సన్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

- ఎల్లంపేటలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..


ప్రత్యూష (ఫైల్)

మరిపెడ రూరల్: అత్తింటి వేధింపులతో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటలో బుధవారం చోటు చేసుకోగా గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన పాక వెంకన్న, ఉమ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. చిన్న కూతురు ప్రత్యూషను (24) ఐదేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా మోతె మండలం జగ్గుగూడెం గ్రామానికి చెందిన పెరుగు పరశురాములుకు ఇచ్చి వివాహం జరిపించారు. ఇద్దరి కుమార్తెలకు వివాహం జరిపించి కట్న, కానుకల కింద చెరో ఒకరం వ్యవసాయ భూమిని రాసి ఇచ్చారు. ప్రత్యూష, పరశురాములు దంపతుల దాంపత్య జీవితం కొంతకాలం సజావుగా కొనసాగింది. ఈ క్రమంలో ప్రత్యూష అత్తగారి ఇంటి వద్ద మరిది పెత్తనంతో ఆ ఉమ్మడి కుటుంబంలో గొడవలు చోటు చేసుకున్నాయి. ఆ గొడవలు చిలికిచిలికి గాలివానలా మారి ప్రత్యూషను కట్నం కింద ఇచ్చిన భూమి అమ్మి డబ్బులు తీసుకురావాలని అత్తింటి సభ్యులు వేధింపులు మొదలు పెట్టారు. ఈ విషయంలో ఇటీవల అత్తామామ, మరిది, భర్త కలిసి ప్రత్యూషపై దాడికి దిగారు. అనంతరం ప్రత్యూషను భర్త పరశురాములు పది రోజుల క్రితం తల్లిగారి ఊరు ఎల్లంపేటలో బలవంతంగా వదిలి వెళ్లాడు. ఎంతకూ తీసుకెళ్లకపోవడంతో ప్రత్యూష ఫోన్‌లో భర్తను నిలదీసింది. దీంతో భర్త 'నాకు, నీకు సంబంధం లేదు.. నీ చావు నీవు చావు' అని తెగేసి చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన ప్రత్యూష ఈ నెల 19వ తేదీన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించగా పక్కంటి వారు చూసి రక్షించే ప్రయత్నం చేశారు. కొన ఊపిరితో ఉన్న ఆమెను కుటుంబీకులు 108లో ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 20 తేదీన మృతి చెందింది. మృతురాలి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతురాలికి 11 నెలల కుమార్తె ఉంది. ఈ ఘటనతో ఎల్లంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విషజ్వరంతో చిన్నారి మృతి

- కొత్తపల్లిలో విషాదఛాయలు


సాత్విక (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: విషజ్వరంతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం కొత్తపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జోగు శంకర్, సంధ్య దంపతులకు కుమార్తె సాత్విక (22 నెలల వయసు) సంతానం. ఒక్కగానొక్క కూతురు కావడంతో సాత్వికను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం చిన్నారికి తీవ్ర జ్వరం వచ్చింది. స్థానికంగా ఆర్ఎంపీలకు చూపించినా తగ్గకపోవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు విషజ్వరంగా గుర్తించి రక్తకణాలు తక్కువ ఉన్నాయని చెప్పి అడ్మిట్ చేసుకున్నారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. దీంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఒక్కగానొక్క కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. రెండేళ్లకే నూరేళ్లు నిండాయా బిడ్డా అంటూ కూతురు మృతదేహం మీదపడి కన్నీరుమున్నీరుగా విలపించారు. చిన్నారి స్వాత్విక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కాగా, గ్రామంలో పారిశుద్ధ్య సమస్యపై పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పలువురికి విష జ్వరాలు వస్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొలిక్కిరాని తల్లీకూతుళ్ల హత్య కేసు

- కేసు ఛేదనలో పోలీసుల నిమగ్నం
- అనుమానితులను విచారిస్తున్న ఖాకీలు
- డీసీపీ నేతృత్వంలో దర్యాప్తు ముమ్మరం

జఫర్‌గఢ్: జిల్లాలో సంచలనం సృష్టించిన తల్లీకూతుళ్ల హత్య కేసు మిస్టరీగా మారింది. పోలీసులు దరాప్తు వేగవంతం చేస్తున్నా ఇప్పటి వరకూ కొలిక్కి రాలేదు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి (ఐ) గ్రామంలో ఈనెల 7న రాత్రి తల్లీకూతుళ్లు గాలి రాణెమ్మ (58), తుమ్మ అన్నమ్మ(95)ను దుండగులు ఇనుపరాడ్లతో కొట్టి అతి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. తల్లీకూతుళ్లు ఒకేసారి హత్యకు గురికావడం పోలీసులకు ఈ కేసు సవాల్‌గా మారింది. రాత్రి సమయంలో హత్యకు గురైన తల్లీకూతుళ్లను ఇంటి పని మనిషి ఉదయం గుర్తించింది. మొదట అన్నమ్మ సాధారణంగా మృతి చెందిందని భావించిన బంధువులు.. ఆ తర్వాత రాణెమ్మ మృతదేహాన్ని చూసి ఆమె శరీరంపై గాయాలు ఉండడంతో వీరిద్దరూ హత్యకు గురైనట్లు ఆలస్యంగా గుర్తించారు. ఈ విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మొదట దొంగలు హత్య చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టినా ఇంట్లో ఉన్న బంగారం, ఇతర వస్తువులు చోరీకి గురికాకపోవడంతో ఆస్తి తగాదాలతోనే ఈ దారుణానికి ఒడిగట్టారా లేక మరో కారణమా అనే విషయాన్ని తేల్చేందుకు పోలీసులు డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలతో ఆధారాలు సేకరించారు. కానీ ఘటనా స్థలిలో పెద్దగా ఆధారాలు లభించలేదు. ఫలితంగా ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది.

అనుమానితులను విచారిస్తున్న పోలీసులు..

హత్యకు గురైన తల్లీకూతళ్లలో కూతురు రాణెమ్మకు కట్నం కింద ఎకరం 10 గుంటలు, తన తల్లి అన్నమ్మను పోషిస్తున్నందుకు రెండెకరాల భూమిని ఇచ్చేందుకు కుటుంబీకులు (అన్నమ్మ కుమారులు) అంగీకారం తెలిపారు. అయితే ఆ తర్వాత ఈ భూమిని రాణెమ్మపై పట్టా చేసే క్రమంలో కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరిగింది. చివరకు రెండున్నర ఎకరాల భూమిని రాణెమ్మ కుమారుడిపై పట్టా చేసినా వివాదం కొనసాగుతోంది. పైగా రాణెమ్మ అందరితో సఖ్యతగా ఉండేదని, అలాంటి ఆమెను ఇక్కడి వారు హత్య చేసి ఉండరని గ్రామస్తులు బాహాటంగానే పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసును ఛేదనకు డీసీపీ రాజమహేంద్ర నాయక్ స్వయంగా రంగంలోకి దిగారు. ఆయన నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్య జరిగిన వెంటనే గ్రామం చుట్టూ ఐదు కిలోమీటర్ల మేర అనుమానితులకు సంబంధించిన సెల్ సంభాషణను పర్యవేక్షించడంతో పాటు సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇప్పటికే అన్నమ్మ కుటుంబానికి చెందిన అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారి నుంచి హత్యకు దారితీసిన వివరాలను రాబట్టేందుకు యత్నిస్తున్నారు. నిందితులను వీలైనంతా త్వరగా గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఇతర కేసులను పక్కన పెట్టి మరీ విచారణ సాగిస్తున్నా ఈ ఘటనలో నిందితులను గుర్తించేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. కాగా, ఈ కేసుకు సంబంధించిన పూర్వాపరాలు తెలుసుకునేందుకు గ్రామస్తులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

మహిళా రిమాండ్ ఖైదీ మృతి

నర్సంపేట రూరల్/వరంగల్‌క్రైం : వరంగల్ జిల్లా నర్సంపేట సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న ఓ మహిళా ఖైదీ గురువారం చనిపోయింది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఓ కేసులో నిందితురాలైనా పెండ్యాల సుచరిత (36) నర్సంపేట సబ్ జైలుకు ఈనెల 13న రిమాండ్ నిమిత్తం తీసుకొచ్చారు. బుధవారం జనరల్ చెకప్‌లో భాగంగా ఆమెను నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించారు. అన్ని రిపోర్టులు నార్మల్‌గానే వచ్చాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం సుచరితకు కడుపునొప్పి వస్తుందని బాత్‌రూమ్‌కు వెళ్లి అక్కడే కుప్పకూలి కింద పడిపోయింది. వెంటనే జైలు సిబ్బంది ఆమెను నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. జైలు సిబ్బంది ఫిర్యాదు మేరకు నర్సంపేట టౌన్ సీఐ రఘుపతిరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటు తెలిపారు. దీనిపై నర్సంపేట జైలర్ లక్ష్మీశృతిని వివరణ కోరగా సుచరిత ఉదయం బాగానే ఉందని, ఒక్కసారిగా కిందపడిపోవడంతో ఆస్పత్రికి తరలించామని, పోస్టుమార్టం అయితేనే పూర్తి వివరాలు తెలుస్తాయని తెలిపారు. కాగా, తన సోదరి మృతిపై అనుమానాలు ఉన్నాయని సుచరిత సోదరుడు పుట్ట సంతోష్ గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గతంలోనూ సుచరితపై కేసులు

సుచరిత భర్త ఏడాదిక్రితం చనిపోయాడు. ప్రస్తుతం హనుమకొండలోని ఓ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ ఇతర మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తుంటుంది. ఈమెపై గతంలోనూ మామునూరు, సుబేదారి పీఎస్‌ల్లో కేసులు కూడా నమోదైనట్లు సమాచారం.

సైబర్ నేరస్తుడికి ఏడాది జైలు, జరిమానా


గిరికుమార్, సైబర్ క్రైమ్ డీఎస్పీ, వరంగల్

వరంగల్ క్రైం : ఓ సైబర్ నేరస్తుడికి హనుమకొండ జిల్లా మూడో అదనపు జూనియర్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి.. ఏడాది 29 రోజుల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించినట్లు వరంగల్ సైబర్ క్రైం డీఎస్పీ కలకోట గిరికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జార్ఖండ్‌లోని జంతారా జిల్లాకు చెందిన బిదూర్ మహతో తరచూ ఆన్‌లైన్, చాటింగ్ మోసాలకు పాల్పడుతున్నాడు. మహతోపై కమిషనరేట్ పరిధిలోని కేయూ పీఎస్‌లో 2, సుబేదారి పీఎస్‌లో 2, మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు నమోదైంది. ఈ క్రమంలో ఇటీవల ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు అధికారినంటూ నగరానికి చెందిన జూపాక అర్చనకు ఫోన్ చేసి రూ.63,837 బదిలీ చేయించుకుని మోసం చేశాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేయూ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా, విచారణ అధికారి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి.. నేరం రుజువుకావడంతో నేరస్తుడు బిదూర్ మహతోకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్ లేదా cybercrime.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇలా ఫిర్యాదు చేయడం వల్ల కోర్టుల ద్వారా నిందితులకు శిక్ష పడడంతో పాటు మోసపోయిన డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

భర్తను చంపిన కేసులో భార్యకు యావజ్జీవ శిక్ష

- ప్రియుడికి కూడా..

కాటారం(మహాముత్తారం): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో భర్తను హతమార్చిన కేసులో భార్యతోపాటు ప్రియుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ భూపాలపల్లి జిల్లా సెషన్ జడ్జి సి.హెచ్ రమేశ్‌బాబు గురువారం తీర్పు వెలువరించారు. మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం రేగులగూడెం గ్రామానికి చెందిన మారుపాక దేవేందర్, స్వప్న భార్యాభర్తలు. స్వప్న మహాముత్తారానికి చెందిన లింగమల్ల కల్యాణ్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. భర్త దేవేందర్‌ను అడ్డు తొలగించుకుంటే సంతోషంగా ఉండొచ్చని భావించిన స్వప్న..కల్యాణ్‌తో కలిసి హత్య చేయడానికి నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో 2020, ఆగష్టు 21న కల్యాణ్ మద్యం బాటిల్‌లో విషం కలిపి ఇవ్వగా స్వప్న భర్తకు తాగించి హత్య చేసింది. దేవేందర్ మద్యం అతిగా సేవించి మృతి చెందినట్లు కుటుంబీకులు, గ్రామస్తులను నమ్మించింది. ఈ ఘటనపై మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శ్రీనివాస్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించగా దేవేందర్ విష ప్రయోగంతో మృతి చెందినట్లు రిపోర్టులో తేలింది. అప్పటి సీఐ హథీరామ్ పూర్తి విచారణ జరిపి స్వప్న, కల్యాణ్‌ను ముద్దాయిలుగా నిర్ధారించి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పోలీసులు ఆధారాలు సమర్పించగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి రమేశ్‌బాబు.. నిందితులు స్వప్న, కల్యాణ్‌కు జీవితకాల కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితులను చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు.

కల్తీ మద్యం తయారీ ముఠా గుట్టురట్టు?

- పోలీసుల అదుపులో పలువురు వ్యక్తులు

మహబూబాబాద్ రూరల్ : కల్తీ మద్యం తయారు చేస్తున్న ముఠా గుట్టు రట్టుచేసి పలువురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పోలీసులు కల్తీ మద్యం తయారు చేస్తున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఈ ఘటనకు సంబంధించి మరికొంతమంది యువకులు ఉన్నట్లు గుర్తించి వారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రాంతంలో గల పాత గోదాంను అద్దెకు తీసుకుని పలువురు వ్యక్తులు అక్కడ స్పిరిట్, నీళ్లు కలిపి కల్తీ మద్యాన్ని తయారు చేస్తున్నట్లు సమాచారం. గుట్టుచప్పుడు కాకుండా కల్తీ మద్యం తయారు చేసి జిల్లాలోని వివిధ గ్రామాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ప్రణాళిక ప్రకారం పోలీసులు గోదాంపై దాడిచేసి కల్తీమద్యం తయారీకి ఉపయోగిస్తున్న స్పిరిట్, ఇతర బాటిళ్లు, స్టికర్లు, వస్తు పరికరాలను తీసుకొచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు ఉండగా మరి కొంతమంది కోసం గాలింపు చేపట్టారు. కల్తీ మద్యం తయారీ కేంద్రం నిర్వహణ వెనుక పలువురు ప్రస్తుత, మాజీ వైన్స్ షాపుల నిర్వాహకులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ అనంతలోకాలకు..

- రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ..
- వ్యక్తి దుర్మరణం


సత్యనారాయణ(ఫైల్)

బచ్చన్నపేట : దైవ దర్శనానికి వెళ్లొస్తూ ఓ వ్యక్తి అనంతలోకాలకు చేరాడు. రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బండనాగారం సమీపంలో జరిగింది. ఎస్సై అబ్దుల్ హమీద్, మృతుడి కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల గ్రామానికి చెందిన మలిపెద్ది సత్యనారాయణ (53) కిరాణా షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం తన భార్య నాగలక్ష్మితో కలిసి తన బైక్‌పై కొడవటూరులోని సిద్ధేశ్వరాలయానికి వచ్చి పూజలు నిర్వహించారు. తిరుగు ప్రయాణంలో తన భార్య నాగలక్ష్మిని స్వగ్రామానికి చెందిన వారు కారులో రాగా అందులో ఎక్కించాడు. బైక్‌పై ఒక్కడే స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన మురుగంటి రంజిత్‌కుమార్ బైక్‌పై బండనాగారం నుంచి బచ్చన్నపేటకు వెళ్తూ లక్ష్మాపూర్ కమాన్ వద్ద ఎదురుగా సత్యనారాయణ బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను చికిత్స నిమిత్తం సిద్దిపేటకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

కాళేశ్వరం: తెలంగాణ, మహారాష్ట్రల్లో కురుస్తున్న వర్షాలతో మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదుల ఉధృతి కొనసాగుతోంది. గురువారం కాళేశ్వరం వద్ద 12.180 మీటర్ల ఎత్తులో నీటిమట్టం పుష్కర ఘాట్లను తాకుతూ ప్రవహించింది. దిగువన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బ్యారేజీకి గోదావరి, ప్రాణహితల ద్వారా 7.40లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రస్తుతం వరద ఉధృతి నిలకడగా కొనసాగుతోందని ఇరిగేషన్ ఇంజనీర్లు పేర్కొన్నారు.